## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివి

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** గాంధీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ హనుమాన్‌పేట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 6వ తేదీ శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సాంబమూర్తిరోడ్డు, ఆంధ్రరత్న రోడ్డు, హనుమాన్‌పేట, గోపాలరావు వీధి, నాగభూషణం వీధి, తిరుమలరావు వీధి, వలవలవారివీధి, అచ్యుతరామయ్యవీధి, కుటుంబరావువీధి, పోలీస్ క్వార్టర్స్, సబ్ జైలు, తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంతంలో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

### లయన్స్‌క్లబ్ విజయవాడ ఇమేజ్ నూతన కమిటీ ఎన్నిక

**సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్):** లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఇమేజ్ నూతన కమిటీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు క్లబ్ కార్యదర్శి టి.జయశ్రీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 సంవత్సరానికి క్లబ్ అధ్యక్షులుగా నందిగామ పద్మజ, సెక్రటరీ ఎన్‌సీఎస్ శ్రీనివాసాచార్యులు, ట్రెజరర్‌గా సీహెచ్ శారదతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వచ్చే నెల 11వ తేదీన నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

### తొలగిన రైల్వే అండర్‌పాస్ కష్టాలు

ఎట్టకేలకు 'దేవీనగర్' రోడ్డు



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** దేవీనగర్ రైల్వే అండర్ పాస్ కష్టాలు తొలగిపోయాయి. ఇబ్బందికరంగా మారిన దేవీనగర్ రైల్వే అండర్ పాస్ వద్ద గురువారం వీఎంసీ అధికారులు రోడ్డు వేయించారు. ఇక్కడ రోడ్డు గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో స్థానికుల అవస్థలు వివరిస్తూ 'సాక్షి' కథనాలు ప్రచురించింది. దీనిపై ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఎంపీ కేశినేని చిన్నితో మాట్లాడటంతో పాటు దేవీనగర్ తీసుకువచ్చి సమస్యలను వివరించారు. దీంతో రోడ్డు వేశారు.

### 60 మంది మందుబాబులకు జరిమానా

**విజయవాడలీగల్:** నగరంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 60 మందికి న్యాయస్థానం జరిమానా విధించింది. నగరంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 60 మందిపై 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. గురువారం 60 మందిని ఆరవ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి లెనిన్‌బాబు 12 మందికి ఒక్కొక్కరికి 15వేలు చొప్పున రూ.1,80,000, మిగిలిన 48మందికి ఒక్కొక్కరికి 10వేలు చొప్పున రూ.4,80,000 జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీచేశారు. ప్రతిరోజూ ప్రత్యేక డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

### వ్యర్థాలను తొలగించండి



**మధురానగర్(విజయవాడసెంట్రల్):** నిత్యం రద్దీగా ఉండే 27వ డివిజన్ బావాజీ పేట ఒకటో లైనులో ఇటీవల యూజీడీ మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేశారు.. ఇంత వరకు బాగానే ఉంది.. కానీ మరమ్మతుల కోసం పగలకొట్టిన యూజీడీ మ్యాన్‌హోల్ వ్యర్థాలను రోడ్డుపైనే వదలివేశారు. దీంతో వాహనచోదకులు, పాదచారులు అవస్థ పడుతున్నారు. రాత్రిపూట చీకటిలో రోడ్డుపై వదలివేసిన వ్యర్థాలను ఢీ కొడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

**అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్):** గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు యువకులు పోలీసులకు పట్టుబడ్డారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 57వ డివిజన్ న్యూఆర్‌ఆర్‌పేటలోని కేజీఎఫ్ అపార్ట్‌మెంట్‌ల వెనుక భాగంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందింది. వారు నిఘా పెట్టి తనిఖీలు చేయగా పసుపులేటి భాను, తమ్మిన నాగదుర్గారావు అలియాస్ నిఖిల్ అనే ఇద్దరు యువకులు అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకొని విచారణ చేయగా వారి వద్ద రెండు కేజీల గంజాయి లభ్యమైంది. నిందితులిద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. న్యాయస్థానం ఎదుట వారిని హాజరుపరచగా కోర్టు వారికి రిమాండ్ విధించింది.

# ఆదమరిస్తే బుడమేరులోకే..

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ఏ మాత్రం ఆదమరిచినా బుడమేరులోకి వెళ్లడమే. జీవీఆర్ నగర్‌లో బుడమేరు పక్కన మార్జిన్లు ఉండటంతో వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. వేలాది మంది రాకపోకలు సాగించే జీవీఆర్ నగర్ గుణదల రోడ్డుపై బుడమేరు పక్కన ఫెన్సింగ్ వేయాలని వారు కోరుతున్నారు. రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వరకు ఫెన్సింగ్ పనులు తుది దశకు చేరుకున్నాయి. దేవీనగర్ నుంచి జీవీఆర్‌నగర్ వరకు ప్రహరీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జీవీఆర్‌నగర్ నుంచి గుణదల రోడ్డులో మాత్రం కనీసం ఫెన్సింగ్ కూడా వేయడం లేదు.

జీవీఆర్‌నగర్ రోడ్డు మార్జిన్‌లో రక్షణ ఏదీ!



దావు బుచ్చయ్యకాలనీలో ప్రమాదకరంగా మార్జిన్



రామకృష్ణాపురంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

**పట్టించుకోవడం లేదు**

రామకృష్ణాపురం నుంచి దేవీనగర్ వరకు బుడమేరు దూరంగానే ఉన్నా ఫెన్సింగ్, ప్రహరీ పనులు చేస్తున్నారు. కానీ ప్రమాదకరంగా ఉన్న జీవీఆర్‌నగర్ గుణదల రోడ్డును మాత్రం పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విశాలంగా ఉండే ఈ మార్గంలో వేగంగా రాకపోకలు సాగించే క్రమంలో అదుపు తప్పితే బుడమేరులోకి వెళ్లిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఇద్దరు ముగ్గురు బుడమేరులోకి వెళ్లిపోయారు. అదృష్టవశాత్తూ బుడమేరులో తక్కువ నీరు ఉండటంతో బతికి బయట పడ్డారు.

**ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్లు**

ఇక్కడ రోడ్డు పక్కన చెత్తచెదారం నింపేయడంతో మార్జిన్లు ప్రమాదకరంగా ఉన్నాయి. వేగంగా వచ్చిన వాహనచోదకులు ఒకవేళ మార్జిన్ దిగితే గుల్లగా ఉండి వాహనాలు బుడమేరులోకి జారిపోయే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. ఇక్కడ రోడ్డు పక్కన పేవర్‌లు ఏర్పాటు చేయాలని అప్పుడే రక్షణ ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రతి చిన్న రోడ్డుకు సైతం పేవర్‌లు ఏర్పాటు చేస్తున్న కాంట్రాక్టర్లు ఇక్కడ మాత్రం విశాలంగా నిర్మించిన రోడ్డుకు ఎందుకు ఏర్పాటు చేయలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

**వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలి**

ఇటీవల వచ్చిన బుడమేరు వరదల నేపథ్యంలో ఇక్కడ రోడ్డు మార్జిన్లు ప్రమాదకరంగా మారాయి. జీవీఆర్‌నగర్ నుంచి గుణదల వరకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తే భద్రత పెరుగుతుందని, వాకింగ్ ట్రాక్ వేస్తే వాకర్లకు అవకాశం ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి**



వేగంగా అభివృద్ధి చెందుతున్న ఇక్కడ బుడమేరు పక్కన ఫెన్సింగ్ ఏర్పాటు చేసి సుందీకరించాలి. అలాగే వాకింగ్ చేయడానికి ట్రాక్ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పుడు గుణదల వరకు రోడ్డు పనులు ప్రారంభం అయ్యిన దృష్ట్యా ఇక్కడ రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. కావున అధికారులు సుందరీకరణ చర్యలు చేపట్టాలి.

–ఎస్‌కే అక్బర్, దావు బుచ్చయ్యకాలనీ

# పని గంటల పెంపు దుర్మార్గం

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



బీసెంట్ రోడ్డులో ధర్నా చేస్తున్న సీఐటీయూ నేతలు

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** కార్మికుల పని గంటలు పెంపు నిర్ణయం అత్యంత దుర్మార్గమని, కూటమి.. కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని సీఐటీయూ అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు పనిగంటలు పెంచడాన్ని నిరసిస్తూ బీసెంట్ రోడ్డులో సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడే నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు దోనేపూడి.కాశీనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పని గంటలు పెంచుతూ రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పనికోసం పోరాడి సాధించుకున్న కార్మికవర్గంపై 12 గంటల పనిని రుద్దుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజా వ్యతిరేకమని ధ్వజమెత్తారు. కనీస వేతనాలు పెంచడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా లేదని, పనిగంటలు పెంచేందుకు మాత్రం అత్యుత్సాహం చూపిందన్నారు. తక్షణం లేబర్ కోడ్స్‌ను, దాని అనుబంధ రూల్స్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరగనున్న జాతీయ సమ్మెలో కార్మికవర్గం పాల్గొనాలన్నారు.రాష్ట్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు దుర్గారావు, నారాయణ, జిల్లా నాయకులు ఎం.సోమేశ్వరరావు, ఎం.బాబురావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ కబడ్డీ సంఘం నుంచి వీర్లంకయ్య, ప్రభాకర్‌ను తొలగించండి

- దుర్వినియోగం చేసిన నిధులను పెనాల్టీతో సహా వసూలు చేయండి
- శాప్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు

**విజయవాడస్పోర్ట్స్:** నిధుల దుర్వినియోగం, నకిలీ క్రీడా సర్టిఫికెట్ల మంజూరుకు పాల్పడిన ఏపీ కబడ్డీ అసోసియేషన్(ఏకేఏ) అధ్యక్ష,కార్యదర్శులు కె.ఈ.ప్రభాకర్, వి.వీర్లంకయ్యపై చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం ఉపక్రమించింది. ఇద్దరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్)కు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి వి.వినయ్‌చంద్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు.

సుదీర్ఘకాలం పాటు ఏకేఏ అధ్యక్ష,కార్యదర్శులుగా పని చేసిన కె.ఈ.ప్రభాకర్, వి.వీర్లంకయ్యలపై పలువురు విజిలెన్స్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన విజిలెన్స్ 2025 మార్చి 31న రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. విజిలెన్స్ నివేదిక ప్రకారం.. వారిద్దరిపై లైంగిక ఆరోపణలు ఉన్నాయని, శాప్ నిధులు రూ.7.12 లక్షలు దుర్వినియోగం చేశారని, నకిలీ క్రీడా సర్టిఫికెట్లు మంజూరు చేశారని నివేదికలో పేర్కొంది. దుర్వినియోగం చేసిన నగదును పెనాల్టీతో సహా వసూలు చేయాలని, నకిలీ సర్టిఫికెట్ ద్వారా పోస్ట్ మాస్టర్ ఉద్యోగం పొందిన వి.సత్యనారాయణను ఉద్యోగం నుంచి తొలగించాలని ఆదేశించింది. వీరి గుర్తింపు రద్దు చేయాలని అమేచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏకేఎఫ్ఐ) అడ్మినిస్ట్రేషన్‌కు సైతం ప్రభుత్వం సూచించింది. వీరి స్థానంలో జి.వెంకటరెడ్డి, వై.శ్రీకాంత్ అధ్యక్షకార్యదర్శులుగా కొనసాగుతున్న సంఘాన్ని గుర్తించాలని శాప్‌ను ఆదేశించింది. అయితే ఇటీవల జరిగిన అసోసియేషన్ ఎన్నికల్లో వెంకటరెడ్డి స్థానంలో ప్రభావతిని అధ్యక్షురాలిగా సంఘ సభ్యులు ఎన్నుకున్నారు.

# అసాంఘిక శక్తుల తిష్ట

దేవినగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్య కాలనీలో పోలీస్ నిఘా అంతంతమాత్రం

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** వేగంగా అభివృద్ధి చెందుతున్న దేవీనగర్, జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ తదితర ప్రాంతాలు ఆకతాయిలకు అడ్డాగా మారాయి. ఇక్కడ సువిశాలంగా ఉండే రోడ్లు, ఖాళీ స్థలాలు, రైల్వే ట్రాక్ ఉండటంతో ఆకతాయిలు ఇక్కడకు చేరుకుని అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు. గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఈ ప్రాంతంలో పేట్రేగి పోతున్నారు. పట్టించుకోవాల్సిన పోలీసుల నిఘా అంతంత మాత్రంగానే ఉండటం వీరికి వరంగా మారింది. ఆకతాయిలు ఇష్టారాజ్యంగా ఇక్కడ తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. దీంతో రాత్రి పూట బయటకు రావాలంటేనే స్థానికులు హడలిపోతున్నారు.

**కంట్లో కారం చల్లి.. ఫోన్ లాక్కునే యత్నం**

నిత్యం రద్దీగా ఉండే దావు బుచ్చయ్యకాలనీ మెయిన్‌రోడ్డు లచన్ ఇన్‌ఫ్రా అపార్ట్‌మెంట్ సమీపంలో బుధవారం ముగ్గురు యువకులు ఒక వ్యక్తి కంట్లో కారం చల్లి ఫోన్‌లాక్కునేందుకు యత్నించారు. ఇంతలో స్థానికులు స్పందించడంతో ద్విచక్రవాహనంపై వచ్చిన ముగ్గురు యువకులు పరారయ్యారు. నిత్యం రద్దీగా ఉండే ఇక్కడ అందరూ చూస్తుండగానే కంట్లో కారం చల్లి మరీ ఫోన్ లాక్కునేందుకు ప్రయత్నించడంపై స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో చిన్నారులు ఆడుకుంటారని ఆకతాయిలు చిన్నారులను ఎత్తుకెళ్లిపోతే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.



ఆకతాయిలు కంట్లో కారం చల్లి ఫోన్ లాక్కునేందుకు యత్నించిన ప్రాంతం



ఆకతాయిలకు అడ్డాగా మారిన డొంక రోడ్డు

**గస్తీ పెంచాలి**

ఈ ప్రాంతంలో రాత్రిపూట గస్తీని మరింత పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పుడు గస్తీ అంతంతమాత్రంగానే జరుగుతుందని దీంతో ఆకతాయిల ఆగడాలు మితిమీరిపోతున్నాయని ఈ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# వైభవంగా బ్రహ్మోత్సవాలు

**చిట్టినగర్(విజయవాడపశ్చిమ):** భీమన వారి పేటలోని శ్రీ విజయదుర్గా రామలింగేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం విజయదుర్గా రామలింగేశ్వర స్వామికి, పంచముఖ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. తెల్లవారుజామున స్వామి వార్లకు అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చనలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ పూజా కార్యక్రమాలను జరిపారు.

**విశేష పూజలు**

అనంతరం ఆలయ ప్రాంగణంలో సువర్చల సమేత శ్రీ వీరాంజనేయ స్వామివారి కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఉభయదాతలు తమ్మిన సతీష్, శ్రీవాణి దంపతులతో కల్యాణం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాన్ని వీక్షించి తరించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు, పలువురు పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు తరలివచ్చారు. మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే సుజనాచౌదరి కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్, చింతలపూడి సత్యనారాయణ, తిరుమలనాథుని కిరణ్‌కుమార్ హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న ప్రముఖులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందచేశారు. అనంతరం స్వామి వారి అన్న ప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు వెన్నం రజనీకుమార్, కార్యదర్శి పవన్‌కుమార్ శర్మ, కోశాధికారి జాగు బాబూరావు పర్యవేక్షణలో ఉత్సవాల ఏర్పాట్లు చేశారు.



విశేష అలంకరణలో వీరాంజనేయ స్వామి

# మొక్కలు నాటి సంరక్షించుకోవాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

**పటమట(విజయవాడతూర్పు):** మొక్కలు నాటి సంరక్షించుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సర్కిల్–3 పరిధిలోని లయోల కళాశాల వద్ద పర్యావరణ రక్షణపై కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వీఎంసీ పరిధిలో ఇప్పటి వరకు 27 కిలోమీటర్ల వరకు ఎవెన్యూ ప్లాంటేషన్ ఉందని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వీటిని పెంచి నగరంలో 10,160 మొక్కలను నాటి ఎవెన్యూ ప్లాంటేషన్‌ను 55 కిలోమీటర్ల వరకు పొడిగించబోతున్నామన్నారు. చెట్ల నుంచి వచ్చే ఆక్సిజన్ ఎంతగానో మేలు చేస్తుందని మనం విడిచే కార్బన్‌డయాక్సైడ్‌ను అవి పీల్చి కాలుష్యాన్ని తగ్గిస్తాయని తెలిపారు. నగర పరిధిలో ప్రతి నియోజకవర్గంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించడమే కాకుండా 'ఫ్యాబ్రిక్ ఇన్– ప్లాస్టిక్ అవుట్' స్టాల్స్‌ని ఏర్పాటు చేశారన్నారు. దుర్గగుడి, పూల మార్కెట్, కాళేశ్వరరావు మార్కెట్, వీఎంసీ ప్రధాన కార్యాలయం, కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్, సాంబమూర్తి రోడ్ రైతు బజార్, పటమట రైతుబజార్ వద్ద ఈ స్టాల్స్ ని ఏర్పాటు చేసి ప్రజల నుంచి ప్లాస్టిక్‌ని సేకరించి వారికి పర్యావరణహితమైన సంచులను పంచుతున్నామని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గంలో హెచ్‌బీ కాలనీ కరెంట్ ఆఫీస్, సెంట్రల్ నియోజకవర్గం పాయకాపురం చెరువు వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ పచ్చదనాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్) డాక్టర్ డాక్టర్ చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడి) పి.వెంకట్ నారాయణ, జోనల్ కమిషనర్ కె.షమీ, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్ పాల్గొన్నారు.

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** పెరుగుతున్న కాలుష్యంతో మానవ మనుగడకే ముప్పు ఏర్పడతుందని 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర



24వ డివిజన్‌లో మొక్కలు నాటుతున్న దృశ్యం

**ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటాలి**

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలు నాటి సంరక్షించాలని వాకర్స్‌క్లబ్ డెప్యూటీ గవర్నర్ గుర్రం ఏడుకొండలు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ సూచించారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని బీఆర్టీఎస్ రోడ్డులో గురువారం హెల్పింగ్ టుగెదర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన అవగాహన, మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ పెరిగిపోతున్న కాలుష్యాన్ని తగ్గించాలంటే మొక్కలు పెంచడం తప్పని సరి అన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని సూచించారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్లకార్డులతో ప్రదర్శించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో హెల్పింగ్ టుగెదర్ వాకర్స్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ కోరంగి నాగమల్లీశ్వరి, ప్రధాన కార్యదర్శి ఎస్‌కే షఫీవుల్లా, కోశాధికారి రహీమా, బోడి ఆంజనేయరాజు, సుబ్బయ్య, రాజారావు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం



మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి అనిత

**విజయవాడలీగల్:** బెజవాడ కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో ప్రజాప్రతినిధుల న్యాయస్థానం న్యాయమూర్తి అనిత మొక్కలు నాటారు. గురువారం కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన అనంతరం న్యాయమూర్తి మాట్లాడుతూ మొక్కలు లేనిదే జీవరాశి బతకలేదని తెలిపారు. బీబీఏ అధ్యక్షుడు ఏకే బాషా, ప్రధాన కార్యదర్శి కేవీ రంగారావు, న్యాయవాదులు వేముల హజరత్తయ్య గుప్తా, బెల్లంకొండ శేఖర్ బాబు, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

### అమిత్ షా యూత్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షుడిగా రమేష్

**మధురానగర్(విజయవాడసెంట్రల్):** నగరానికి చెందిన రమేష్ అమిత్ షా యూత్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. కర్ణాటకలో అమిత్ షా యూత్ బ్రిగేడ్ నేషనల్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎస్.పవర్ చేతుల మీదుగా రమేష్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చిన ఎస్.పవర్, జాతీయ అధ్యక్షులు డాక్టర్ శుక్ల, వ్యవస్థాపకుడు కేంద్ర మంత్రి అమిత్ షా మద్దిశెట్టి సామ్యూల్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .

# విద్యార్థులకు ఆటల పోటీలు

**గన్నవరం:** స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. క్విజ్, ఖోఖో, మ్యూజికల్ చైర్స్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం, చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. విశ్రాంత ఉద్యోగి పడమట రమేష్‌కుమార్ గ్రంథాలయ ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు చిమట రామారావు, లైబ్రేరియన్ పీడీ లక్ష్మి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

**పుస్తక పఠనం చేయండి**

**పెనమలూరు:** విద్యార్థులు పుస్తక పఠనం చేయాలని వణుకూరు గ్రంథాలయ అధికారి భారతి అన్నారు. వణుకూరు గ్రంథాలయంలో గురువారం వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. భారతి మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాలను వచ్చి పుస్తక పఠనం చేయటం వలన విజ్ఞానం పెరుగుతుందన్నారు. అనంతరం సుమతి పద్యాలు, తోక కథలు చెప్పించారు.

**పుస్తక పఠనంతో ఏకాగ్రత, పట్టుదల**

**కంకిపాడు:** విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలని వక్తలు సూచించారు. వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా గురువారం కంకిపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనంలో పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ.. పుస్తక పఠనం ద్వారా చదువుపై ఏకాగ్రత, పట్టుదల, శ్రద్ధ అలవడతాయన్నారు.

### మద్యం షాపులో వ్యక్తిపై దాడి

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** మద్యం మత్తులో వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటన భవానీపురం స్వాతి సెంటర్‌లోని ఓ వైన్స్ వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం భవానీపురం ఔట్ ఏజెన్సీ ప్రాంతానికి చెందిన కంతేటి రత్నకిశోర్ సితార సెంటర్‌లో వెల్డింగ్ షాపులో పనిచేస్తున్నాడు. పని ముగించుకొని బుధవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తూ స్వాతి థియేటర్ సమీపంలోని ఎన్‌హెచ్ 65 పక్కన ఓ వైన్స్‌లో మద్యం సేవించేందుకు వెళ్లాడు. అక్కడ అప్పటికే మద్యం తాగుతున్న చావలి గోపాలకృష్ణకు ఇతనికి మధ్య మాటామాట పెరిగి వాగ్వాదం జరిగింది. దీంతో అతను రత్నకిశోర్‌పై బీర్ బాటిల్‌తో దాడి చేసి, ఛాతీపై బలంగా కొట్టాడు. అడ్డుకునేందుకు ప్రయత్నించగా కుడి చేతిపై దాడి చేశాడు. దాడిలో గాయపడిన రత్నకిశోర్‌ను స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై బాధితుడు గురువారం భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

### ఘనంగా విగ్రహాల ఊరేగింపు

**పెనమలూరు:** పోరంకి శ్రీనగర్‌కాలనీలో వేం చేసి ఉన్న శ్రీకోదండ రామాలయంలో నూతన విగ్రహాల ప్రతిష్ఠ సందర్భంగా గురువారం స్వామి వార్ల విగ్రహాలను గ్రామంలో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఊరేగించారు. ఆలయంలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో జరుగబోయే ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని పలు పూజలు నిర్వహించారు. ఆలయంలో శ్రీ సీతాలక్ష్మణ హనుమంత్ సమేత శ్రీరామచంద్రమూర్తి, వినాయక, సర్పరూప సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. ఈ సందర్భంగా శ్రీనగర్‌కాలనీలో స్వామివార్ల విగ్రహాలను, కలశం, సుదర్శన చక్రాలను ఊరేగించారు. స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి, పూజా కార్యక్రమాల్లో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావాలని ట్రస్ట్ గౌరవ అధ్యక్షుడు వై.రాధాకృష్ణమూర్తి కోరారు.

### గ్రీన్ ఎనర్జీలో పెట్టుబడులు పెరగాలి

డాక్టర్ అనిత

**గాంధీనగర్(విజయవాడసెంట్రల్):** రాబోయే రోజుల్లో గ్రీన్ ఎనర్జీలో పెట్టుబడులు పెరగాల్సిన ఆవశ్యకత ఉందని పర్యావరణ సంస్థ గౌరవ చైర్మన్ డాక్టర్ జి.అనిత అన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎప్పుడైతే పర్యావరణం ఆధారంగా వృత్తులు పెరుగుతాయో దాంతో ప్రజలు ఆధారపడి బతుకుతారో అప్పుడే ప్రజలు పర్యావరణాన్ని కాపాడుకుంటారని తెలిపారు. సంస్థ అధ్యక్షుడు బీఎస్ భార్గవ్ కుమార్ మాట్లాడుతూ కొండపల్లి బొమ్మలు అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్నా దానికి ఉపయోగించే పొనికి చెక్క మాత్రం కనుమరుగవుతోందని దీన్ని మనం కాపాడుకోవాలని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ వెంకట్ కొల్లూరి మాట్లాడుతూ మానవ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయటంలో తీవ్ర స్థాయిలో వైఫల్యం ఉందని, వెంటనే నివారించాలన్నారు. మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ కాళహస్తి నల్లిబోయిన, రాష్ట్ర ఎన్జీఓ నాయకులు నాళం మురళీ కృష్ణ, నాయకులు ఉమామహేశ్వరి, కవితాలక్ష్మి, అనూష, వెంకయ్య, దుర్గలక్ష్మి, దుర్గ శివ నాగ ప్రసాద్, రమ్య, బాలాజీ, ఫణీంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.